

- మహానాడుకు తరలుతున్న తెలుగు తమ్ముళ్లు
- కార్లు, బస్సుల్లో ప్రయాణం
- టీడీపీ జెండాలు, ఫ్లెక్సీలతో వాహనాల అలంకరణ
- ఒక్కో నియోజకవర్గం నుంచి ఐదు బస్సులు?

మహా సందడి



విజయనగరం నుంచి మహానాడుకు బయలుదేరిన అశోక్‌గజపతిరాజు, టీడీపీ శ్రేణులు

విజయనగరం, మే 26(ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ పండుగ (మహానాడు)కు తమ్ముళ్లు పయనమయ్యారు. కార్యకర్తల నుంచి నేతల వరకు కలిసి బయలుదేరారు. పార్టీ జెండాలు, ఫ్లెక్సీలతో అలంకరించిన వాహనాల్లో సందడి చేస్తూ కదిలారు. ఈ నెల 27 నుంచి రెండు రోజుల పాటు కడపలో మహానాడుకు పార్టీ ఏర్పాట్లు చేసింది. టీడీపీ ఆవిర్భవించిన తరువాత కడపలో మహానాడు నిర్వహించడం ఇదే తొలిసారి. హైదరాబాదు, తిరుపతి, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో మహానాడు జరిగింది. తొలిరోజు పార్టీ ప్రతినిధుల సభ, రెండోరోజు భారీ బహిరంగ సభ ఉంటుంది. మహానాడు నిర్వహణ కమిటీల్లో జిల్లా నుంచి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కళా వెంకటరావు, అదితి గజపతిరాజు, సీనియర్ నాయకుడు కర్రోతు బంగార్రాజు తదితరులకు (మిగతా 6వ పేజీలో..)

● పండుగ వాతావరణంలో మహానాడు: మంత్రి శ్రీనివాస్

విజయనగరం నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కడప జిల్లాకు బయలుదేరారు. పండుగ వాతావరణంలో మహానాడు జరగనుంది. మరో వైపు పార్టీ కమిటీల ప్రక్రియ జిల్లాలో ఇప్పటికే పూర్తయింది. జిల్లా, రాష్ట్ర, జాతీయ కమిటీల ప్రకటన మహానాడులో జరిగే అవకాశం ఉంది. మహానాడు సాంస్కృతిక కార్యక్రమాల కన్వీనరుగా అన్ని ప్రాంతాలకు అవకాశం కల్పించాను.

● టీడీపీకి పండుగ: ఎంపీ కలిశెట్టి

మహానాడు.. తెలుగుదేశం పార్టీకి పండుగ లాంటిది. సామాన్య కార్యకర్తగా, నాయకుడిగా ఎన్నో పర్యాయాలు మహానాడుకు వెళ్లాను. ఎంపీగా ఎన్నికైన తరువాత ఇదే తొలి మహానాడు. చాలా ఆనందంగా ఉంది. ఫొటో ఎగ్జిబిషన్ కమిటీ బాధ్యతలను శతశాతం నిర్వహించాను.

● పునరంకితం కోసమే మహానాడు: టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగార్జున

పార్టీ, ప్రజల కోసం శ్రేణులు పునరంకితం కావడం కోసమే మహానాడు జరుగుతుంటుంది. దుష్టపాలన అంతమొందించడానికి నాయకులు, కార్యకర్తలు అహోరాత్రులు శ్రమించారు. ఫలితంగా 2024 ఎన్నికల్లో విజయం సాధించాం. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో మినీ మహానాడు జరిగింది. ఆ తీర్మానాలకు మహానాడులో ఆమోదం పొందుతాం.

● దుష్టపాలన నుంచి విముక్తి : ఎమ్మెల్యే కళావెంకటరావు

దుష్టపాలన నుంచి విముక్తి కలిగింది. 2024లో జరిగిన ఎన్నికల్లో మంచి విజయం సాధించిన అనంతరం జరుగుతున్న తొలి మహానాడు ఇది. పార్టీ కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్నది. మహానాడు తీర్మానాల కమిటీ మెంబరుగా ప్రజలకు, పార్టీకి ఉపయోగపడే తీర్మానాలు రూపొందించి మహానాడులో ఆమోదం కోసం సిద్ధం చేశాను.

● అధిక సంఖ్యలో నాయకులు.. కార్యకర్తలు: ఎమ్మెల్యే అదితి

విజయనగరంలో మినీ మహానాడు విజయవంతం అయ్యింది. అందులో తీర్మానాలను జిల్లా పార్టీకి నివేదించాం. కడప మహానాడుకు విజయనగరం నియోజక వర్గం నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు.

● ఉత్సాహంగా పార్టీ శ్రేణులు: ఎమ్మెల్యే బేబీనాయన

కడప మహానాడుకు బొబ్బిలి పట్టణం, నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్తున్నాం. ఈ ఏడాది మహానాడుకు ఎంతో ప్రాధాన్యం ఉంది. పార్టీ అధికారంలో ఉండడంతో శ్రేణులు ఉత్సాహంగా తరలివెళ్తున్నారు. నియోజకవర్గ సమస్యలను మహానాడు దృష్టికి తీసుకువెళ్తాం.

● మహానాడు దృష్టికి రాజాం సమస్యలు: ఎమ్మెల్యే కోండ్రు

మహానాడుకు రాజాం నియోజకవర్గం నుంచి ఎక్కువ సంఖ్యలో బస్సులు, రైళ్లు, ఇతర రవాణామార్గాల ద్వారా బయలుదేరారు. పార్టీ అధికారంలోకి ఉండడంతో శ్రేణులు ఉత్సాహంగా ముందుకు సాగుతున్నాయి. రాజాం నియోజకవర్గంలోని పలు సమస్యలను కూడా రాష్ట్ర మహానాడుకు నివేదిస్తాం.

● విశాఖలో విలీనం చేయాలని కోరతా: ఎమ్మెల్యే లలితకుమారి

ఎస్.కోట నియోజకవర్గ సమస్యలను తీర్మానం రూపంలో మహానాడుకు నివేదించాం. ఈ నియోజకవర్గాన్ని విశాఖలో కలపాలని, అదే విధంగా నియోజకవర్గంలోని సాగునీటి వనరుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని మరోసారి కోరతాను. నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కూడా విన్నవిస్తున్నాం.

నాలుగోరోజు కొనసాగిన విచారణ

● ఉగ్ర నీడలపై లోతుగా ఆరా తీస్తున్న దర్యాప్తు సంస్థలు

విజయనగరం/క్రైం, మే 26(ఆంధ్రజ్యోతి): పేలుళ్ల కుట్రపై విజయనగరంలోని పీటీసీలో చేపట్టిన విచారణ నాలుగోరోజు సోమవారం కూడా కొనసాగింది. నిందితులు సిరాజ్‌రెహ్మాన్, సమీర్‌లను మరింత లోతుగా ఆరా తీశారు. వీరిద్దరినీ ఉగ్రవాద సానుభూతిపరులుగా గుర్తించి ఈ నెల 16న విజయనగరంలో అరెస్టు చేసి 14రోజుల రిమాండ్‌కు తరలించిన సంగతి విదితమే. ఈ క్రమంలో మరింత లోతైన విచారణ కోసం పోలీసులు నిందితుల కస్టడీని కోర్టుకు కోరగా ఏడు రోజుల కస్టడీకి అనుమతి లభించింది. శుక్రవారం నుంచి విజయనగరం పోలీస్ ట్రైనింగ్ కళాశాలలో విచారిస్తున్నారు. సోమవారం దర్యాప్తు మరింత వేగవంతం చేశారు. సిరాజ్, సమీర్‌పై లోతైన ప్రశ్నల వర్షం కురిపించారు. వారిని వర్షా బ్లాక్‌లో వేర్వేరుగా విచారణ జరుపుతున్నారు. ఇంకా పోలీస్ కస్టడీ గడువు మూడు రోజులుంది.

ఉగ్ర మూలాలపై నిందితుల విచారణ జరుగుతున్న పీటీసీ



కేసులో రాజీకి రావడం లేదని హత్య

● వెంకటరమణపేటలో సంచలనం

● హతురాలి కుమార్తెను ప్రేమించిన నిందితుడు

● చాకచక్యంగా ఛేదించిన పోలీసులు



కేసు వివరాలను చెబుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

శృంగవరపుకోట మే 26 (ఆంధ్రజ్యోతి):

పోక్సో కేసులో శిక్ష తప్పదని, ప్రేమించిన అమ్మాయి దక్కదని, ప్రియురాలు తల్లి రాజీకి రాకపోవడమే ఈ పరిస్థితికి కారణమని భావించిన ఆ యువకుడు ఆమెను అంతమొందించాలనుకున్నాడు. ప్రియరాలితో కలిసి పథకం ప్రకారం చంపేశాడు. శృంగవరపుకోట మండలం వెంకటరమణపేటలో జరిగిన ఈ హత్య పది రోజుల క్రితం సంచలనం సృష్టించింది. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వర్రి నారాయణమూర్తితో కలసి కేసు వివరాలను సోమవారం తెలిపారు.

ఈనెల 17న వెంకటరమణపేట గ్రామానికి చెందిన వై.వెంకటలక్ష్మిని కుమార్తె రాత్రి 10 గంటల సమయంలో బహిర్భూమికని తీసుకెళ్లింది. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న ఇదే గ్రామానికి చెందిన హరి కృష్ణ, అతని స్నేహితుడు కలిసి వెంకటలక్ష్మిపై దాడి చేశారు. కత్తితో మెడపై తీవ్రంగా గాయపరిచి చంపేశారు. ఆపై ఆమె చీరకు రాళ్లు కట్టి సమీపంలోని బావిలో పడేశారు. ఇదంతా బాలిక ముందే జరిగింది. ఇదేమీ తెలియనట్లు ఇంటికి చేరుకున్న బాలిక కొంత సమయం తరువాత తండ్రి సత్యనారాయణ, సోదరుడు హరీష్‌ను నిద్ర లేపింది. అమ్మతో వస్తుండగా దారిలో కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేసి తీసుకెళ్లారంటూ (మిగతా 6వ పేజీలో..)

హత్యకు కారణమిదీ..

వెంకటలక్ష్మి కుమార్తె, నిందితుడు హరికృష్ణ ప్రేమించుకున్నారు. వీరి ప్రేమను ఇష్టపడని బాలిక తల్లి వెంకటలక్ష్మి 2023లో పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. బాలిక మైనర్‌కావడంతో హరికృష్ణపై పోలీస్‌లు పోక్సో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు కోర్టులో ట్రయిల్‌కు వచ్చింది. కేసు నమోదైన దగ్గర నుంచి రాజీకి రమ్మని, బాలికను తనకిచ్చి పెళ్లిచేయాలని వెంకటలక్ష్మిని హరికృష్ణ కోరుతున్నాడు. రాజీకి రానని, తన కుతుర్ని ఇవ్వబోనని తేల్చిచెబు తుండడంతో నిందితుడు ఈ దారుణానికి ఒడిగట్టాడు.



మూడు నెలలకే రహదారుణం

వర్షానికి కొట్టుకుపోయిన మారిక రహదారిని చూసి అందరూ విస్తుపోతున్నారు. గిరిశిఖర గ్రామం మారికలో ఉపాధి నిధులతో ఈ ఏడాది జనవరిలో రహదారి నిర్మించారు. రెండు రోజుల కిందట కురిసిన వర్షానికి తారురోడ్డు ధ్వంసమైంది. నిర్మాణంలో ఎంతటి నాణ్యత పాటించారో ఇట్టే అర్థమవుతోందని, ఈ పరిస్థితికి కారకులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు చల్లా జగన్, గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. వాన నీరు వెళ్లేందుకు రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించకపోవడమేంటని ప్రశ్నిస్తున్నారు.

- వేపాడ, మే 26(ఆంధ్రజ్యోతి):

ముందే కానలు



● చెరువుల్లో చేరుతున్న నీరు

విజయనగరం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఈసారి ముందే వరుణుడు కరుణించాడు. మూడు రోజులుగా జిల్లాలో వర్షాలు పడుతున్నాయి. సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచీ ఆకాశం మేఘావృతం కావడం.. ఆపై చిరు జల్లులు, కొన్నిచోట్ల భారీగా వర్షం పడింది. చాలాచోట్ల గాలులు, మెరుపులు, ఉరుములు లేకుండానే భారీ వర్షం కురిసింది. విజయనగరం, నెల్లిమర్ల, గుర్ల, గరివిడి, చీపురుపల్లి, డెంకాడ, గంట్యాడ, బొండపల్లి, వేపాడ, దత్తిరాజేరు తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. ఈ వానలతో చెరువుల్లో నీరు చేరుతోంది. దీంతో రైతులకు కాస్తంత ఊరట లభించింది. జిల్లాలో 55 శాతం పంటలు చెరువులపై ఆధారపడి సాగవుతున్నాయి. మరో రెండో మూడు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే చెరువులు పూర్తిగా నిండే అవకాశం ఉంది. నైరుతి రుతుపవనాల రాకతో మరో మూడు నాలుగు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ నిపుణులు ప్రకటించారు. రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధం కావొచ్చునని జిల్లా వ్యవసాయాధికారి తారక రామరావు సూచించారు.



ఆర్‌ఈసీఎస్‌ను పునరుద్ధరించేనా?

● సాధారణ ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ

● ఎమ్మెల్యే కళావెంకట్రావు పలుమార్లు విన్నపం

● ఈఆర్‌సీకి సిఫారసు లేఖ వెళ్తేనే వినియోగదారులకు ఊరట

చీపురుపల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి గ్రామీణ విద్యుత్ సహకార సంఘం పునరుద్ధరణ కోసం రైతులు, వినియోగదారులు ఆశతో నిరీక్షిస్తున్నారు. గతంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో అందిన సేవలతో మేలు పొందిన ఆయా వర్గాలు తిరిగి ఈసంస్థ వస్తే తప్ప తమకు సౌకర్యాలు అందవని అంటున్నారు. సంస్థ పునరుద్ధరణపై కొంత కాలంగా ఎమ్మెల్యే కళావెంకటరావు స్థానికులకు భరోసా ఇస్తున్నారు. దీంతో ప్రభుత్వం నుంచి సానుకూల ఉత్తర్వులు విడుదలవుతాయని వారంతా భావిస్తున్నారు.

నాలుగు దశాబ్దాల పాటు సేవలందించిన చీపురుపల్లి ఆర్‌ఈసీఎస్ నాలుగేళ్ల కిందట ఈపీడీసీఎల్‌లో విలీనమైన విషయం తెలిసిందే. అయితే 2024 ఎన్నికల ముందు ప్రచారం కోసం చీపురుపల్లి వచ్చిన తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఈ సంస్థ పునరుద్ధరణపై స్థానికులకు మాటిచ్చారు. అప్పటి నుంచీ ఎమ్మెల్యే కళావెంకటరావు కూడా పలు మార్లు ముఖ్యమంత్రిని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రాలు ఇస్తున్నారు. గత నెలలో జరిగిన భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్‌ఈసీఎస్‌కు సంబంధించి అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేసినట్టు ఎమ్మెల్యే పలుమార్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో రెస్కో పునరుద్ధరణ ఎప్పుడు జరుగుతుందా అని స్థానికులు ఎదురుచూస్తున్నారు. ఆర్‌ఈసీఎస్‌ను ఈపీడీసీఎల్‌లో విలీనాన్ని నిరసిస్తూ స్థానిక తెలుగుదేశం నాయకులు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేశారు. సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నాలు, నిరసన ప్రదర్శనలు చేపట్టారు.

2020 నుంచి అనుమతి ఇవ్వని ఈఆర్‌సీ

ఢిల్లీలోని ఎలక్ట్రికల్ రెగ్యులేటరీ కమిషన్(ఈఆర్‌సీ) ఆధ్వర్యంలో పనిచేసే ఈ సంస్థ (మిగతా 6వ పేజీలో..)



విజయనగరంలో యోగా స్ట్రీట్

● యోగాతో ఆరోగ్యం: కమిషనర్

విజయనగరం/రింగురోడ్డు, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యానికి రాచబాట వేయవచ్చునని, శారీరక ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యాన్నీ పెంపొందించుకోవచ్చునని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో యోగా స్ట్రీట్ నిర్వహించారు. పైడిమాంబ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి అనేక మంది స్వచ్ఛందంగా హాజరయ్యారు. అనంతరం కోట వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ, భారతీయ సాంస్కృతిలో ఓ సంప్రదాయంగా వస్తున్న వ్యవస్థల్లో యోగా ఒకటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని యోగా ఆవశ్యకతను పరిపూర్ణంగా తెలుసుకోవాలన్నారు.

కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టరు జీవనరాణి, ఆయుష్ అధికారి డాక్టరు ఆనందరావు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు, సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ఈఈ టి.రాయల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: యోగాసనాల్లో అధికారులు, స్థానికులు

బదిలీ దరఖాస్తులకు నేడే ఆఖరు

- ఇప్పటి వరకూ అందినవి 4,869
- సర్వర్ సమస్యతో మాస్టార్ల సతమతం

4లో

బాలికా వికాసం.. భవితకు సోపానం

- జిల్లా వ్యాప్తంగా వేసవి శిక్షణ
- ఆడపిల్లలకు వివిధ అంశాలపై అవగాహన

4లో

పచ్చని చెట్లుపై గొడ్డలి వేటు

ఉత్సాహంగా మహానాడుకు..

● పెద్ద ఎత్తున వాహనాల్లో తరలిన టీడీపీ శ్రేణులు

కడపలో మంగళవారం నుంచి నిర్వహించనున్న టీడీపీ మహానాడు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు పయనమయ్యారు. వీరి వాహనాలను స్థానిక నాయకులు, కార్యకర్తలు సోమవారం జెండాలు ఊపి ప్రారంభించారు.

-ఆంధ్రజ్యోతి బృందం



గజపతినగరం: మహానాడుకు బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు



చీపురుపల్లి నుంచి...



జామి: జెండాలు ఊపి వాహనాన్ని ప్రారంభిస్తూ...



రాజాం నుంచి బయలుదేరిన టీడీపీ శ్రేణులు



ఫిర్యాదుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఏఎస్పీ సౌమ్యలత

అర్జీల పరిష్కారంపై దృష్టి సారించండి

● అదనపు ఎస్పీ సౌమ్యలత

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 32 ఫిర్యాదులు

విజయనగరం క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌ల పరిధిలో ఫిర్యాదుదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని అదనపు ఎస్పీ సౌమ్యలత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఇందులో 32 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో భూ తగాదాలకు సంబంధించి 10, కుటుంబ కలహాలకు సంబంధించి 3, మోసాలకు పాల్పడినట్టు 4, ఇతర అంశాలకు సంబంధించి 15 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని ఆమె ఆదేశించారు. వాటి పూర్వాపరాలపై విచారించి.. వాస్తవమైనట్టయితే, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐలు లీలారావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి, సుధాకర్, ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.



డీఈవో కార్యాలయంలో ఉపాధ్యాయుల సందడి

ముగుస్తున్న గడువు...
సర్వర్ సమస్యతో సతమతం

● ఉపాధ్యాయ బదిలీ దరఖాస్తులకు నేడే ఆఖరు ● ఇప్పటి వరకూ అందినవి 4,869

విజయనగరం కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): తమ బదిలీలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ విషయంలో సాంకేతిక ఇబ్బందులతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ఉపాధ్యాయుల బదిలీలకు దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 21న మొదలైన సంగతి తెలిసిందే. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 4,869 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లా ప్రకారం 100 మంది ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. పాఠశాల సహాయకుల దరఖాస్తులకు స్వీకరణ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. 2,239 మంది స్కూల్ అసిస్టెంట్లు, 66 మంది ఎల్‌పీలు, 27 మంది పీఈటీలు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. 2,437 మంది ఎస్‌జీటీలు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మంగళవారం వరకూ దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. వేల సంఖ్యలో ఎస్‌జీటీలు దరఖాస్తు చేసుకోవడంతో సర్వర్ సమస్య వెంటాడుతోంది. దరఖాస్తు చేసుకున్న సమయంలో తలెత్తుతున్న సాంకేతిక పరమైన సమస్యలను సరిదిద్దేందుకు స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈవోలకు లాగిన్‌కు అవకాశం ఇచ్చారు. ఇది కాస్త ఊరటనిచ్చింది. దరఖాస్తు పత్రాలతో పాటు ప్రిఫరెన్షియల్ కేటగిరీలో గల ఉపాధ్యాయులు ఇటీవల మెడికల్ బోర్డు జారీ చేసిన పత్రాలు జత చేయాల్సి ఉంది. ఉపాధ్యాయులు సర్వీసు రిజిస్ట్రార్‌లో నమోదు చేశారా? లేదా అనే విషయాన్ని ధ్రువీకరించిన తరువాత వాటికి ఎంఈవోలు ఆమోదం తెలపాల్సి ఉంది. అటువంటి దరఖాస్తులను ప్రత్యేకంగా సిద్ధం చేసి.. డీఈవో కార్యాలయానికి పంపించాల్సి ఉంది. బదిలీల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక కేటగిరీ కోసం అడ్డదారులకు ముందుగా చెక్ పెట్టడం గమనార్హం. అయినా కొందరు ఉపాధ్యాయులు తమ పలుకుబడి ఉపయోగించుకొని.. మెడికల్ బోర్డు నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా ఆసుపత్రి జారీ చేసిన ఓ మెడికల్ సర్టిఫికెట్‌పై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌కు ఓ ఉపాధ్యాయురాలు ఫిర్యాదు చేశారు. అంగవైకల్య శాతం తక్కువగా ఉన్నప్పటికీ... ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు ధ్రువపత్రం జారీ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇది ఇలా ఉంటే దరఖాస్తుదారుల సందేహాలు నివృత్తి చేయడానికి జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. అవసరమైన ఉపాధ్యాయులు ఆ సెల్ సాయాన్ని పొందవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పచ్చని చెట్టుపై గొడ్డలి వేటు

● ఎప్పటికప్పుడు నేల కూలుస్తున్న విద్యుత్ శాఖ



ట్రాన్స్‌కో సిబ్బంది కూల్చివేసిన చెట్టు



రాజాం రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని ప్రభుత్వం... స్వచ్ఛంద సంస్థలు ప్రయత్నం చేస్తుంటే... నిర్వహణ పేరుతో భారీగా పెరిగిన చెట్లను నేల కూలుస్తున్నారు విద్యుత్ శాఖ సిబ్బంది. రాజాం ప్రాంతంలో తరచూ ఇదే పరిస్థితి నెలకొంటోంది. మొక్కలు నాటేందుకు, వాటిని సంరక్షించేందుకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చిస్తోంది. కానీ విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉంటున్నాయన్న నెపంతో తరచూ వీరు చెట్లను నేలకూలుస్తున్నారు. తాజాగా రాజాం-శ్రీకాకుళం రోడ్డులో నిర్వహణ పేరుతో పచ్చనిచెట్లను నేలకూల్చారు. గతంలో బొబ్బిలి రోడ్డులోని ఫైర్‌స్టేషన్ ప్రాంగణంలో 20కి పైగా భారీ చెట్లను కొట్టేసి... వేలాది రూపాయలకు వాటిని అమ్ముకున్నారు. తాజాగా శ్రీకాకుళం రోడ్డులో చెట్లను నేలకూల్చడం విమర్శలకు తావిస్తోంది. భవిష్యత్తులో చెట్లను నరికే కార్యక్రమాలకు ట్రాన్స్‌కో ఫుల్‌స్టాప్ పెట్టాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. నిర్వహణ పేరుతో చెట్లను నేలకూల్చడంపై రాజాం ట్రాన్స్‌కో ఏఈ కుమార్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా... చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లకు తగిలి.. అవి తెగిపోయే పరిస్థితులు తరచూ నెలకొంటున్నాయని తెలిపారు. తెగిన తీగెల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని అన్నారు. ఈనెల 25న పెరిగిన కొమ్మలను మాత్రమే కొట్టాలని సిబ్బందికి స్పష్టం చేశానని, కూలీలు చెట్లు నరికిన విషయం తన దృష్టికి రాలేదని ఏఈ కుమార్ వివరించారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏజేఏసీ నాయకులు

గిరిజన డీఎస్సీ ప్రకటించాలి

● జీవో నెం.3 అమలు చేయాలి ● కదం తొక్కిన గిరిజనులు

సీతంపేట రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలో గిరిజన యువత కోసం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని... జీవో నెం.3ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజనులు కదం తొక్కారు. సోమవారం ఏజేఏసీ ఆధ్వర్యంలో గిరిజన సమస్యల పరిష్కారం కోరుతూ సీతంపేట వారపు సంత నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో మానవహారం నిర్వహించి... గిరిజన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా ఏజేఏసీ అధ్యక్షులు బి.శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావులు మాట్లాడుతూ జీవో నెం.3 స్థానంలో ప్రభుత్వం కొత్త చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అన్ని శాఖల ఉద్యోగాలను శతశాతం గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని కోరారు. మెగా డీఎస్సీలో గిరిజన నిరుద్యోగ యువతకు రావాల్సిన పోస్టులను కలిపి చూపించారని, వాటిని మినహాయించాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ ప్రాంతానికి సంబంధించిన ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ పరిధిలోని అన్ని శాఖల ఉద్యోగుల ఖాళీలను గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల ఆందోళనను గుర్తించిన కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డిలు వారి వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు ఏజేసీ నాయకులు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ గిరిజనుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని... పరిష్కారమయ్యేలా చూస్తానని పేర్కొన్నారు. ఈ ర్యాలీలో ఏజేఏసీ ఉపాధ్యక్షులు సవర చిరంజీవులు, కార్యదర్శులు బి.ఉమామహేశ్వరరావు, కె.భాస్కరరావు, బి.రామారావు, ఎస్.గంగారావు, సవర సింహాచలం, పి.పురుషోత్తం, ప్రమోద్, బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పూర్ణపాడు-లాబేసు వంతెన పూర్తి చేయండి

జియ్యమ్మవలస, మే 26 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలాన్ని రెండుగా విడగొడుతున్న నాగావళి నదిపై పూర్ణపాడు-లాబేసు వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కొమరాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం మండల కన్వీనర్ కె.సాంబమూర్తి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ 2006లో రూ.3.50 కోట్లతో ప్రారంభించిన పనులు నేటికీ పూర్తికాకపోవడం దారుణమన్నారు. ఈ వంతెన నిర్మాణం పూర్తి చేసే దాకా పోరాటం ఆగదన్నారు. అనంతరం తహసీల్దార్ సాయికామేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్.. ఈ వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేసి, పెండింగ్ పనులు త్వరగా ప్రారంభించి... పూర్తయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, పి.రాజశేఖర్, గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



కుడి మట్టికట్ట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తదితరులు

30న తోటపల్లిలో యోగాంధ్ర

పార్వతీపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ నెల 30న యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం సంబంధిత అధికారులతో తన కార్యాలయంలో సమీక్షించారు. జూన్ 5న సీతంపేటలోని ఎన్‌టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో, 12న మక్కువ మండలం వెంగళరాయ సాగరం వద్ద ఉన్న ఏనుగు కొండ దగ్గర యోగా కార్యక్రమం ఉంటుందన్నారు. దు చేసుకునేలా మండల అధికారులు దృష్టి సారించాలన్నారు. యోగాంధ్ర వెబ్‌సైట్‌లో అధిక సంఖ్యలో నమోదు కావాలన్నారు. ఆరోగ్య ప్రయోజనాలు కలిగించే యోగాపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్ పాల్, ఎంపీడీవో జి.ఫైడితల్లి, తహసీల్దార్ పి.బాల, ఐటీడీఏ ఏఈ తిరుపతిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గౌరీప్రసాద్, పర్యాటకాధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన..

గరుగుబిల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాంతంలో ఈ నెల 30న యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం కలెక్టర్ ఎ.శ్యామప్రసాద్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవలు ప్రాజెక్టు పరిధిలోని కుడి మట్టికట్ట, ఐటీడీఏ పార్కు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. యోగా కార్యక్రమం ఆలయ ప్రాంగణంలో చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ యోగాంధ్రపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో యోగా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో యోగాంధ్ర మాసోత్సవాల నిర్వహణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. గ్రామ, మండల స్థాయిలో యోగా శిక్షకులను నమో

నేటి నుంచి గ్రామ స్థాయిలో...

పార్వతీపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా గ్రామస్థాయిలో పెద్ద ఎత్తున వివిధ పోటీలు నిర్వహి స్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పది నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారికి, 20 నుంచి 35 మధ్య వయస్సు ఉన్నవారికి, 35 సంవత్సరాలు పైబడిన వారికి మూడు కేటగిరీలలో పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆమె వివరించారు. జిల్లా విద్యాశాకాధికారి పోటీలను సమన్వయం చేయాలని ఆమె ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీవోలు అశుతోష్ శ్రీవాత్సవ, సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత తదితరులు పాల్గొన్నారు.

బాలికా వికాసం..
భవితకు సోపానం

● జిల్లా వ్యాప్తంగా వేసవి శిక్షణ ● ఆడపిల్లలకు వివిధ అంశాలపై అవగాహన

గజపతినగరం, మే 26 (ఆంధ్రజ్యోతి): పసిప్రాయంలోనే లైంగిక వేధింపులు.. ముక్కు పచ్చలారని చిన్నారికి మూడు ముళ్లు.. ప్రేమ పేరుతో వంచన... ఇలా రకరకాలుగా ఆడపిల్లలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో బాలికల రక్షణ, వారి అభివద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీని కోసం బాలికా వికాసం కార్యక్రమాన్ని చేపడుతోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు కిశోర బాలికా వికాసం కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ కార్యక్రమం మరుగున పడింది. ప్రస్తుత కూటమి సర్కారు దీన్ని పునఃప్రారంభించింది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికా వికాసం కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది.

విభిన్న అంశాలతో...

సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలపై అవగాహన కల్పిస్తారు. ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జూన్ 10 వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 11 నుంచి 18 ఏళ్ల వయస్సు గల కిశోర బాలికలకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించి.. వివిధ అంశాలపై శిక్షణ అందిస్తున్నారు. 12 అంశాలపై అవగాహన కల్పిస్తారు. ముందుగా దీనిపై ఏఎన్‌ఎంలు, మహిళా పోలీసులు, ఆశాలు, వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. రుతుక్రమం-శుభ్రత, లైంగిక విద్య, బాల్య వివాహాలు, ఆరోగ్యం-ప్రభావాలు, పిల్లల హక్కులు, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, పోక్సో చట్టంపై అవగాహన, కౌమారంలో రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. లింగ వివక్ష, అసమానతలు, ఉన్నత విద్య, నైపుణ్యాలు, భవిష్యత్ మార్గదర్శకం, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ భద్రత, ఆర్థిక అంశాల నిర్వహణపై చైతన్యపరుస్తున్నారు. బాలికల్లో నాయకత్వ లక్షణాలు, సాధికారికత, క్రీడలు, యోగా, వ్యాయామం, బాల్య వివాహాల సమస్యలు, నిర్మూలన వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నారు.

వివిధ వర్గాల భాగస్వామ్యంతో...

ప్రభుత్వ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆర్పీలు తదితరులను భాగస్వాములను చేశారు. వీరు ప్రభుత్వ పాఠశాలలు, గ్రామీణ ప్రాంతాల్లో రద్దీగా ఉన్న ప్రదేశాల్లో సదస్సులు నిర్వహిస్తున్నారు. కిశోర వికాసం నిర్వహణకు గ్రామ, వార్డు స్థాయిలో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా 5 నుంచి 20మంది కమిటీ సభ్యులను ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు. అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు ఇందులో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. వసతులను దృష్టిలో ఉంచుకొని అంగన్‌వాడీ కేంద్రం లేదా గ్రామ వార్డు సచివాలయాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. తమ నివాస ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నా... లైంగిక వేధింపులకు గురవుతున్నట్లు గుర్తించినా.. వెంటనే గ్రూపు సభ్యులు అధికారులకు సమాచారం అందిస్తారు. తక్షణమే అడ్డుకట్ట వేసే విధంగా చర్యలు తీసుకుంటారు.



బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్, వైద్య సిబ్బంది (ఫైల్)

ఆత్మస్థైర్యం నింపేలా..

కౌమారదశలో బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు... తమపై జరిగే అఘాయిత్యాలను ఎదుర్కొనేలా తయారు చేయడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుంది. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయడం, లింగ సమానత్వం పెంపొందించేందుకు ఇది దోహద పడుతుంది. 12 అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు వారిలో నైపుణ్యం వెలికి తీసేందుకు ఈ శిక్షణ ఉపయోగ పడుతుంది.

-నాగమణి, ఐసీడీఎస్ పీఓ, గజపతినగరం

మరమ్మతులు లేక.. వినియోగించక

● మండల పరిషత్ కార్యాలయానికే పరిమితమైన ట్రాక్టర్

● వాటర్ ట్యాంకర్ ఎక్కడో మరి..

● పట్టించుకోని అధికారులు

గజపతినగరం, మే26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వాహన సంరక్షణను అధికారులు గాలికొదిలేశారు. వాహనానికి మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావల్సిన యంత్రాంగం వాటిపై దృష్టిపెట్టడంలేదు. పర్యవసానంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రూ.లక్షల విలువైన ట్రాక్టర్ దిష్టిబొమ్మగా దర్శనమిస్తోంది. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య చొరవతో విజయనగరం ఎంపీ బొత్స ఝాన్సీరాణి మండలానికి ట్రాక్టర్‌ను సమకూర్చారు. మండలంలోని తాగునీటి ఎద్దడి నివారణ ఏర్పాట్లలో భాగంగా ట్యాంకర్ ఏర్పాటు చేసేందుకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. కొంతకాలం తాగునీటి సమస్య లేకుండా వాటర్ ట్యాంకర్‌ను అధికారులు వినియోగించారు. కొద్దికాలం తర్వాత ట్రాక్టర్ మరమ్మతుకు గురైంది. దాంతో వాటర్ ట్యాంకర్‌ను అప్పటి నాయకులు సొంత అవసరాలకు వాడుకున్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయించి దాన్ని వినియోగంలోకి తెచ్చారు. ఆ తర్వాత మళ్లీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ట్రాక్టర్‌ను తిరిగి వారి సొంత అవసరాలకు వినియోగించుకున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోకి చేర్చింది. అయితే వాటర్ ట్యాంకర్ మాత్రం ఎక్కడ ఉందనే దానిపై ఎలాంటి సమాచారం లేదు. దాదాపు ఏడాది కావస్తున్నా ట్రాక్టర్ మరమ్మతుకు అధికారులు కనీస చర్యలు చేపట్టడంలేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి ట్రాక్టర్‌కు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని మండలవాసులు కోరుతున్నారు.



మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న ట్రాక్టర్

తల్లీకొడుకు అదృశ్యం

సీతానగరం, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో అంటిపేట గ్రామానికి చెందిన సారిపల్లి జ్యోతితో పాటు కుమారుడు సంజయ్ ఈనెల 23న అదృశ్యమయ్యారు. సోమవారం స్థానిక పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 23న రాత్రి కుటుంబ సభ్యులతో ఇంట్లో గొడవపడ్డారు. గొడవ పడిన అనంతరం అందరూ నిద్రిస్తున్న సమయంలో కొడుకును తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. 24న ఉదయం నుంచి చుట్టుపక్కల గ్రామాల్లోని స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికారు. వారిద్దరి ఆచూకీ లేకపోవడంతో సోమవారం జ్యోతి తల్లి కోట సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దాంతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాజేశ్ తెలిపారు.

ఆధార్‌తో అనుసంధానం చేసుకోండి

కొత్తవలస, మే 26 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధిలో సొంత ఇల్లు కలిగిన యజమానులు సంబంధిత ఇంటి పన్నును ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని పంచాయతీ ఈవో శైలజ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఇంటి పన్నును ఆధార్‌తో అనుసంధానం చేయడం వల్ల పన్నులు సులభంగా చెల్లించుకోవచ్చన్నారు. పంచాయతీ పరిధిలోని రికార్డులను ఆన్‌లైన్ చేయడం జరుగుతోందని ఆమె వివరించారు.

జ్వరాలపై ఇంటింటా సర్వే

కొత్తవలస, మే 26 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో తుమ్మికాపల్లిలో సోమవారం సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వాతావరణంలో మార్పుల వల్ల జ్వరం, ఒంటి నొప్పి, దగ్గు, గొంతు నొప్పి వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సర్వేలో వైద్య సిబ్బంది సత్యారావు, ఈశ్వరరావు, జ్యోతి పాల్గొన్నారు.

150 రోజుల పని కల్పించండి

నెల్లిమర్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సారిపల్లి దళితులకు ఏడాదికి 150 రోజుల ఉపాధి పనిదినాలను కల్పించాలని డీబీఎస్‌యూ నాయకులు ఆర్.ఈశ్వరరావు, ఆర్.రామేశ్వరరావు కలెక్టర్ అంబేడ్కర్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో వారు వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామానికి చెందిన అధిక శాతం భూములు తారకరామతీర్థ సాగర్ రిజర్వాయర్ ముంపు భూములుగా మారడంతో ఉపాధి కోల్పోయామని ఆవేదన వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పనులతో ఆదుకోవాలని వారు కోరారు.

దివ్యాంగుల గుర్తింపు

నెల్లిమర్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాల్లో ప్రవేశాలకు గానూ మండలంలోని వివిధ గ్రామాల్లో దివ్యాంగుల గుర్తింపునకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఐఈఆర్‌టీ బెల్లాన అప్పలనాయుడు తెలిపారు. సోమవారం మండలంలోని తాళ్లపూడిపేట, ఎల్.ఎన్.పురం, టెక్కలి, చంద్రంపేట, కొండవెలగాడ గ్రామాల్లో సర్వే నిర్వహించామని ఆయన వివరించారు.

అందుబాటులో విత్తనాలు

సంతకవిటి, మే 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పి.నవీన్ అన్నారు. సోమవారం మండలంలోని మందరాడలోని రైతు సేవాకేంద్రంలో ఆయన రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాల కోసం రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అందుబాటులో ఇంద్ర, స్వర్ణ మసూరు, సాంబ మసూరు, అమర తదితర రకాల విత్తనాల ఉన్నాయని వివరించారు.

యోగాంధ్రను విజయవంతం చేయండి

మెరకముడిదాం, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలో జూన్ 11న తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా చేయాలని ఎంపీడీవో జి.భాస్కరరావు కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ సచివాలయం నుంచి ఏడుగురిని ఎంపిక చేసి వీరికి యోగాపై శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ పొందిన సభ్యులు ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రతీ ఒక్కరితో యోగా చేయించాలన్నారు. జూన్ 11న 500 మందితో మండల స్థాయిలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అజురఫీ జాన్, ఈవోఈఆర్‌డీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

●దత్తిరాజేరు: యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో వై.వి.రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంవోటీలు, టీవోటీలతో సమావేశం నిర్వహించారు. యోగాపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

24 గంటల్లో ఫిర్యాదులు పరిష్కరించండి

● గడువు దాటితే షోకాజ్ నోటీసులు ● కలెక్టర్ అంబేడ్కర్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం కలెక్టరేట్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కార వేదికకు అందిన వినతులను 24 గంటల్లోగా పరిష్కరించాలని కలెక్టర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఆయన.. జేసీ సేతు మాధవన్, ఇన్‌చార్జి డీఆర్వో మురళి, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, నూకరాజు, ప్రమీల గాంధీలతో కలిసి 160 వినతులను స్వీకరించారు. పీజీఆర్‌ఎస్‌కు వినతులు ఇవ్వడానికి వచ్చిన నిరక్షరాస్యులకు అర్జీలను రాయడానికి కలెక్టరేట్ వద్ద సహాయ కేంద్రాన్ని కలెక్టర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బదిలీలపై ఫైల్స్‌ను ఆఖరి తేదీన కాకుండా ముందుగానే పెట్టాలని అధికారులకు ఆదేశించారు. బదిలీల్లో ఎటువంటి సిఫారసులను ఆమోదించమన్నారు. అంతకు ముందుకు ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆన్‌లైన్‌లో ఇంకా చూడాల్సిన వినతులు 8 ఉన్నాయన్నారు. గడువు దాటిన వినతులు రెండు ఉన్నట్టు గుర్తించామన్నారు. అందుకు సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్టు ప్రకటించారు.

పిల్లల పెంపకంపై దృష్టి సారించండి

గజపతినగరం, మే26 (ఆంధ్రజ్యోతి): పిల్లల పెంపకంపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిసారించాలని న్యాయాధికారి ఎ.విజయ్ రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో పిల్లల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు విద్యతో పాటు వారి నడవడికపై దృష్టిపెట్టాలన్నారు. బడిఈడు పిల్లలను బడికి పంపించాలన్నారు. అలా కాకుండా వారితో పనులు చేయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి విజయ్ రాజ్‌కుమార్

ముగిసిన ఆహ్వాన క్రికెట్ టోర్నీ

విజయనగరం రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని కణపాక రేడ్డు కామాక్షినగర్ మైదానంలో నిర్వహిస్తున్న ఆహ్వాన క్రికెట్ టోర్నీ సోమవారం ముగిసింది. తెలుగు యువత నగర అధ్యక్షుడు మాతా బుజ్జి నిర్వహించిన పోటీలను టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి పి.రాజేశ్‌వర్మ ప్రారంభించారు. విజేతలకు ఈ నెలఖరులో నిర్వహించనున్న కార్యక్రమంలో బహుమతులను ప్రదానం చేయనున్నారు. అలాగే టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అదే వేదికపై ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్టు నిర్వాహకుడు మాతా బుజ్జి తెలిపారు.



ప్రథమ స్థానంలో నిలిచిన క్రికెట్ జట్టు

జేవీవీ జిల్లా కార్యవర్గం ఎన్నిక

విజయనగరం బాబామెట్ట, మే 26 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక జిల్లా మహాసభల్లో భాగంగా రెండేళ్లకు 24 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్‌ను రెండోసారి కూడా కొనసాగించేందుకు కమిటీ నిర్ణయించింది. ప్రధాన కార్యదర్శిగా చీపురుపల్లికి చెందిన ఉపాధ్యాయుడు డాక్టర్ మిరియాల కృష్ణారావు, కోశాధికారిగా శివాజీ నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా పి.రామారావు, మమ్ముల తిరుపతిరావు, సహాయ కార్యదర్శిగా శాంతికుమార్‌ను ఎన్నుకున్నారు.



ఎన్నికైన జేవీవీ జిల్లా కమిటీ

సంతకవిటిలో కుండపోత వర్షం

సంతకవిటి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం ఉదయం కుండపోత వర్షం కురిసింది. సంతకవిటితో పాటు ఎం.ఆర్.అగ్రహారం, మామిడిపల్లి, మోదుగులపేట, గోవిందపురం తదితర గ్రామాల్లో వర్షం కురిసిన వర్షానికి పొలాల్లో నీరు చేరింది. వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పొలాల్లో వరదనీరు

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠోత్సవం

డెంకాడ, మే26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బంటుపల్లిలో సోమవారం సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు కంది చంద్రశేఖరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీకి రూ.25వేలు విరాళం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రాముడి పరిపాలన నడుస్తోందన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి సంఘం సురేష్, సర్పంచ్ చిక్కాల జనార్దన్, తెలుగు యువత మండల అధ్యక్షుడు బొండా రవికిరణ్, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాల ప్రతిష్ఠోత్సవంలో మాజీ ఎంపీపీ కంది

●వేపాడ, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బానాదిలో గ్రామదేవత పరదేశమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. పరదేశమ్మ తల్లి విగ్రహం, యంత్ర ప్రతిష్ఠను ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 28న ఉదయం 8.24 గంటలకు విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని కమిటీ తెలిపింది.

గ్రామసభ రసాభాస

జామి, మే 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాగరంలో సెల్ టవర్ ఏర్పాటు కోసం నిర్వహించిన గ్రామసభ రసభాసగా మారింది. సోమవారం పంచాయతీ కార్యదర్శి అనురాధ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటైంది. సభలో కొందరు సెల్ టవర్‌కు అనుకూలంగా, ఇంకొందరు వ్యతిరేకిస్తూ గొడవ పడ్డారు. దాంతో కార్యదర్శి సభను వాయిదా వేశారు. సెల్‌టవర్ ఏర్పాటు విషయంపై ప్రస్తుతం అనుమతులు ఇవ్వలేమని తేల్చేశారు. దాంతో సభ బయట సెల్‌టవర్ అనుకూలురు, వ్యతిరేకులు పరస్పరం బాహాబాహికి దిగారు. స్థానిక పెద్దలు వారిని మందలించడంతో వెనక్కి తగ్గారు. గ్రామంలో అనుమతులు లేకుండా వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని యువకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాంట్‌కు ఎందుకు పన్ను విధించడంలేవని మండిపడ్డారు. దానిపై పంచాయతీ కార్యదర్శి మట్లాడుతూ వాటర్ ప్లాంట్‌కు పన్ను విషయంపై డీపీవో, ఈవోపీఆర్‌డీ చర్చిస్తున్నారని తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

రాజాం రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది మెప్మాలోని ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మిక నాయకుడు రామ్మూర్తినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ ఉద్యోగులకు సోమవారం ఆయన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది నిరసన తెలియజేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోందని ఆరోపించారు. టెక్నికల్ సిబ్బందికి రూ.29,200, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24,500 జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 15 ఏళ్ల పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

క్షయ వ్యాధి నిర్మూలనపై చర్యలు

గజపతినగరం, మే26 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రతిఒక్కరి బాధ్యత అని ముక్త్ క్షయ భారత్ నిర్మూలన అధికారి డాక్టర్ నీరద అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో వైద్యసిబ్బందికి క్షయ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది చివరి నాటికి క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ కార్యదర్శిగా 'పురం'

బొండపల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలో బోడసింగిపేటలో ఓ ప్రైవేట్ కళాశాల ఆవరణలో సోమవారం సీపీఐ నియోజకవర్గ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. నియోజకవర్గ కార్యదర్శిగా పురం అప్పారావు, సహాయ కార్యదర్శిగా జి.రామునాయుడుతో పాటు 9 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పురం మాట్లాడుతూ సీపీఐ 9వ జిల్లా మహాసభలు జూలై 26 27 తేదీల్లో బొబ్బిలి పట్టణంలో జరగనున్నాయన్నారు. ఈ సభలను అందరూ విజయవంతం చేయాలని కోరారు.

రౌతు కుటుంబానికి పరామర్శ

మెరకముడిదాం, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పలవలస గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ రౌతు కుమారస్వామి నాయుడు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ పరామర్శించారు. కుమారస్వామి నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సోదరుడు రమేశ్, కుమార్తెతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బొత్సతో పాటు విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైసీపీ నాయకులు కొట్ల వెంకటరావు, తాడ్డి వేణుగోపాలరావు, శిరువూరి వెంకటరమణరాజు, సర్పంచ్ బెహరా రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదస్థితిలో నడక వంతెన

● కూలితే రెండు గ్రామాల మధ్య రాకపోకలు బంద్



కూలేందుకు సిద్ధంగా ఉన్న వంతెన

వేపాడ, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చామలాపల్లి- పోతుబందిపాలెం గ్రామాల మధ్య మారిక గెడ్డపై నిర్మించిన నడక వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. రెండు గ్రామాల మధ్య రాకపోకలకు వీలుగా మాజీ ఎంపీ పురందరేశ్వరి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. దాంతో నడక వంతెన నిర్మాణం చేపట్టారు. అయితే వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించలేదు. దాంతో గెడ్డలో వరదనీటి ఉధృతి వల్ల వంతెనకు ముప్పు వాటిల్లుతోంది. ఏ క్షణాన్నైనా వంతెన కూలే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మారిక గెడ్డపై వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే గానీ కలెక్టర్ గానీ నిధులు మంజూరు చేయాలని గిరిజనులు కోరారు.



వంతెన పక్కన కోతకు గురవుతున్న గట్టు

తీగ లాగితే డొంక కదులుతోంది

● చోరీ ఘటనలో వెలుగు చూస్తున్న కొత్త విషయాలు

● స్థానికుల సహకారం ఉన్నట్టు అనుమానం?

● పెరుగుతున్న నిందితుల జాబితా

చీపురుపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): తీగ లాగితే డొంకంతా కదులుతోంది. చీపురుపల్లి చోరీ ఘటనకు సంబంధించి పోలీసులు జరుపుతున్న దర్యాప్తులో కొత్త విషయాలు వెలుగు చూస్తున్నట్టు సమాచారం. చోరీకి పాల్పడిన బృందంలో ఎక్కువ మంది సభ్యులు ఉన్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే గుంటూరు జిల్లా తెనాలిలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ బృందంలో ఎక్కువ మంది సభ్యులు ఉన్నట్టు భావిస్తున్నారు. తెనాలి వెళ్లిన పోలీసు అధికారుల తమ వెంట ఐదుగురిని తీసుకుని వచ్చినట్టు తెలిసింది. ఇంకా, మిగిలిన వారి కోసం గాలిస్తున్నట్టు సమాచారం. దొంగతనానికి కొద్ది రోజుల ముందు స్థానికంగా రెక్కీ నిర్వహించి దొంగలకు సమాచారం ఇచ్చిన మహిళ ఎవరన్నది పోలీసులు ఆరా తీస్తున్నారు. కాగా, పట్టణంలో ధనికుల సమాచారం తెలుసుకోవడం కోసం దోపిడీ దొంగలు స్థానికులపై ఆధార పడినట్టు తెలిసింది. చీపురుపల్లి మండలంలోని గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి, సమాచారం ఇవ్వడంలో దొంగలకు పరోక్షంగా సహకరించినట్టు పోలీసులకు సమాచారం అందింది. ఆ దిశగా కూడా పోలీసులు తమ దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, దొంగల దాడిలో గాయాలపాలైన ఇద్దరు మహిళలు విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో కోలుకుంటున్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

రాజాం రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చెంపేట-గడిముడిదాం రోడ్డులో ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రాజాంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖ తరలించారు. అక్కడ వెంకటరమణ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 10 గంటల సమయంలో మృతి చెందాడు. రాజాం ఎస్‌ఐ రవికిరణ్ అందించిన సమాచారం ప్రకారం.. బలిజిపేట మండలంలోని గంగాడ గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి వెంకట రమణ ద్విచక్ర వాహనంపై రాజాం వస్తుండగా మితిమీరిన వేగంతో వస్తున్న ఆటో.. ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొంది. గాయపడిన వెంకటరమణను రాజాంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం విశాఖలోని ఆసుపత్రికి తరలించారు. వెంకటరమణ మామయ్య జగన్మోహనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీ: వ్యక్తికి గాయాలు

శృంగవరపుకోట, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఎస్.కోట పోలీసులు అందించిన వివరాల మేరకు.. వంగర మండలానికి చెందిన పల్లా సూర్యనారాయణ రెండేళ్లుగా ఎస్.కోట శివారు సీతంపేటలో ఇసుప ముక్కల వ్యాపారం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో రోడ్డుపై నడుస్తున్న అతడిని విజయనగరం నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దాంతో సూర్యనారాయణ గాయపడ్డాడు. స్థానికులు విజయనగరం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్.కోట పోలీసులు కేసు నమోదు చేశారు.

విశాఖ ఉక్కు సమస్యను పరిష్కరించండి

విజయనగరం కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమ సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు టి.కె.రమణ, అప్పలసూరి, రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ 32 మంది బలిదానంతో విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పడిందన్నారు. అలాంటి పరిశ్రమను కేంద్రం విక్రయిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి సమర్థంగా నడపాలన్నారు. 4 వేల మంది కార్మికులను తొలగించి, నిర్బంధాన్ని ప్రయోగించాలని కేంద్ర చూడటం తగదన్నారు. అనంతరం జేసీకి వినతిపత్రం అందజేశారు. నిరసనలో నాయకులు రెడ్డి శంకరరావు, బి.రాంబాబు, బి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సంఘ నాయకులు

ఇళ్ల పట్టాలు మంజూరు చేయండి

విజయనగరం కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 30వ వార్డు పరిధిలోని ధర్మపురిలో గల 3.77 ఎకరాల ప్రభుత్వ భూమిలో బలహీన వర్గాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని పట్టణ బడుగు బలహీన వర్గాల సంక్షేమ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాను కేటాయించి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. నిరసనలో సంఘ నాయకులు రెడ్డి నారాయణరావు, గుజ్జురు శంకరరావు తదితరులు ఉన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

నెల్లిమర్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో భూ ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టాలని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టొంపల నర్సయ్య కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు, పార్లమెంట్ ఇన్‌చార్జి చిన్నం అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నెల్లిమర్ల ఇన్‌చార్జి తహసీల్దార్ రవిశంకర్‌కు వారు వినతిపత్రం అందజేశారు. మండలంలోని గుషినిలో గతంలో భూ ఆక్రమణలను గుర్తించిన రెవెన్యూ సిబ్బంది బోర్డులు ఏర్పాటు చేశారన్నారు. అయితే ఆ బోర్డులను ఆక్రమణ దారులు తొలగించి సాగు చేసుకుంటున్నారన్నారు. అలాగే కొండవెలగాడ రెవెన్యూ పరిధిలోని రోళ్లవాక రహదారిలో సీతమ్మ చెరువును ఆనుకుని ఓ ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థ ప్రతినిధులు 9 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నారని తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని వారు కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సారాపై నిరంతర నిఘా

కొత్తవలస, మే 26 (ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనకు మండలంలోని రామలింగపురం, అప్పన్నదొరపాలెం, చిన మన్నిపాలెం గ్రామాల్లో నిరంతర నిఘా పెట్టామని ఎక్సైజ్ సీఐ జి.ఎస్.రాజశేఖర నాయుడు తెలిపారు. సోమవారం సంబంధిత గ్రామస్థులతో వేర్వేరుగా సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా రహిత గ్రామాలుగా ప్రకటించి అందుకు అనుగుణంగా గ్రామ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. సారాకు బానిసలైన వారిని గుర్తించి వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తామన్నారు. బెల్లం అమ్మకాలు చేసేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశాల్లో ఎస్‌ఐలు వి.ఎస్.రాజు, రమ్యశ్రీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ

మహా సందడి

(3వ పేజీ తరువాయి)

స్థానం లభించిన విషయం తెలిసిందే. ఇప్పటికే వీరంతా అప్పగించిన పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా ఒక్కో నియోజకవర్గం ఐదు బస్సుల వరకు బయలుదేరాయి. పార్టీ అధికారంలోకి రావడంతో తెలుగుతమ్ముళ్లు మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు. జిల్లాలో గ్రామ, వార్డు, డివిజన్ స్థాయి టీడీపీ కమిటీల నియామకం పూర్తయ్యింది. మండల, నగర, పట్టణ పార్టీ కార్యవర్గాల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతోంది. బూత్‌కు ఒక కన్వీనరు, కో-కన్వీనరు, కుటుంబ సాధికార సారథులు (కెఎస్ఎస్), క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జుల నియామక ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సోమవారం కడపకు పయనమయ్యారు.

కేసులో రాజీకి రావడం లేదని హత్య

(3వ పేజీ తరువాయి)

నమ్మబలికింది. రాత్రంతా వెతికిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులకు వెంకటలక్ష్మి ఆచూకీ దొరక్కపోవడంతో ఈనెల 18న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా తల్లిని బహిర్భూమికి తీసుకెళ్లిన కుమార్తెను విచారించారు. పొంతన లేని సమాధానం చెబుతుండడంతో పోలీసులకు బాలిక తీరుపై అనుమానం వచ్చింది. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. నేర స్థలంలో దొరికిన రక్తపు మరకలు ఆధారంగా బాలికను లోతుగా విచారించడంతో అసలు విషయం బయటపెట్టింది. తన తల్లిని ఎవరూ కిడ్నాప్ చేయలేదని, తన ప్రేమకు అడ్డం పడుతోందని చంపేందుకు ప్రేమికుడికి సహకరించినట్లు అంగీకరించింది. బాలిక వయసు తక్కువ కావడంతో జువైనల్ హోమ్‌కు తరలించారు. హత్య చేసి పరారైన నిందితుడిని పట్టుకొనేందుకు మూడు బృందాలను ఏర్పాటు చేశారు. అరకులో ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి బయలుదేరారు. మార్గమధ్యలో కనిపించడంతో పట్టుకున్నారు. నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. సోమవారం కోర్టుకు తరలించారు. మరో నిందితుడు మైనర్ కావడంతో మీడియా ముందుకు తీసుకురాలేదు. విలేకరుల సమావేశంలో ఎస్ఐలు చంద్రశేఖర్, గంగరాజులు కూడా ఉన్నారు.

ఆర్ఈసీఎస్‌ను పునరుద్ధరించేనా?

(3వ పేజీ తరువాయి)

గత ప్రభుత్వం తీసుకున్న పాలసీ కారణంగా 2020లో ఈపీడీసీఎల్‌లో విలీనమైంది. ఈఆర్‌సీ నుంచి ఏటా లైసెన్సు రెన్యువల్ అయితేనే ఆర్ఈసీఎస్ సంస్థ మనుగడ సాగిస్తుంది. కమిషన్ నుంచి రెన్యువల్ పొందాలంటే ప్రతి సంవత్సరం రెగ్యులేటరీ కమిషన్‌కు ప్రభుత్వం నుంచి సిఫారసు లేఖ అందాలి. ఇలా అందిన సంస్థలకు మాత్రమే ఈఆర్‌సీ లైసెన్సు మంజూరు చేస్తుంది. కాగా చీపురుపల్లి ఆర్ఈసీఎస్‌కు 2019-20లోనే రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు నిలిపివేసింది. అయినప్పటికీ 2020 ఆర్థిక సంవత్సరం ముగిసే వరకూ వేచిచూసిన రెగ్యులేటరీ కమిషన్ ప్రభుత్వం సిఫారసు లేఖ ఇవ్వనందున 2021-22 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన లైసెన్సును ఇక మంజూరు చేయలేమని రెస్కోకు అప్పట్లో తేల్చిచెప్పింది. ఈ మేరకు సంస్థ ఎండీకి పంపిన లేఖలో ఆర్ఈసీఎస్ నిర్వహణకు అనుమతి లేనందున విద్యుత్ విక్రయం, పంపిణీ తదితర కార్యకలాపాలు ఈపీడీసీఎల్‌కు అప్పగిస్తున్నట్టు పేర్కొంది. అప్పటి నుంచి చీపురుపల్లి రెస్కో పరిధిలో ఈ సంస్థ చేయాల్సిన పనులన్నీ ఈపీడీసీఎల్ ఆధ్వర్యంలోనే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సంస్థ పునరుద్ధరణ కోసం సాక్షాత్తూ ముఖ్యమంత్రి హామీ ఇవ్వడంతో తప్పక నెరవేరుతుందని వినియోగదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

● నివాసాలను తాకుతున్న వైనం



వెలగవలసలో ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ వైర్లు

బొబ్బిలి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): అలజంగి పంచాయతీ వెలగవలస గ్రామంలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు ఇళ్లను తాకుతున్నట్టుగా వేలాడుతూ ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి ఇళ్ల పైనుంచి విద్యుత్ వైర్లను తొలగించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని చాలా సార్లు ట్రాన్స్‌కో అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించామని, ఎవరూ పట్టించుకోలేదని వాపోతున్నారు. ● ఈ విషయంపై ఏఈ సంబశివరావుని వివరణ కోరగా ఆ గ్రామాన్ని పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కళలను ప్రోత్సహించాలి

బొబ్బిలి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): కళలను, కళాకారులను ప్రోత్సహించాలని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు అన్నారు. సోమవారం బొబ్బిలిలోని కళాభారతిలో యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు విజయమోహన్ ఆధ్వర్యంలో ఆనందోబ్రహ్మ సకల కళల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం కళాకారులను సత్కరించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, మాజీ సైనిక సంఘం గౌరవ అధ్యక్షుడు రామినాయుడు, అధ్యక్షుడు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించండి



స్థానికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని కంచర వీధి, సంఘం వీధి, రత్నాలనగర్ ఏరియా, ఆకుల రెల్లి వీధి ప్రాంతాల్లో ఆమె సోమవారం పర్యటించారు. కాలువల్లో పూడికను తొలగించాలని, వీధుల్లో చెత్తను ఎప్పటికప్పుడే తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు, సిబ్బందికి ఆదేశించారు. అలాగే స్థానికులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేయాలి

బొబ్బిలి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర అభివృద్ధికి పాలకులు కృషి చేయాలని ఉత్తరాంధ్ర సాధన సమితి అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మునాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మల్లపురెడ్డి శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన వ్యవసాయ సాగు చట్టాలు రద్దు చేయాలని కోరారు. అలాగే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

బొబ్బిలి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీ పరిధి సాహితీ నగర్‌లో గత కొన్నేళ్లగా వీధి దీపాలు లేకపోవడంపై ఆ కాలనీవాసులు ఇటీవల ఎమ్మెల్యే బేబీనాయన దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పురపాలక సంఘం అధికారులు సాహితీ నగర్‌లో వీధి దీపాలు ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు సోమవారం ఈ వీధి దీపాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రామలక్ష్మి, డీఈఈ కిరణ్‌కుమార్, ఏఈ గుప్త తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపుతాం

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

● ఐటీడీఏ పీజీఆర్ఎస్‌కు 135 వినతులు

సీతంపేట రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కు వచ్చే వినతుల కు శాశ్వత పరిష్కారం చూపుతామని పార్వతీపురం మన్యం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. సోమవారం సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్ఆ ర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని, గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 135 వినతులు వచ్చాయి. పీజీఆర్ఎస్‌కు వచ్చే వినతుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వినతుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అర్జీదారులు తమ సమస్యలను మండల, డివిజన్, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. సీతం పేట మండలంలో మండ, రాయిమానుగూడ గ్రామాల్లో తాగునీటి ట్యాంక్ ఏర్పాటుచేయాలని పలువురు కోరారు.



పార్వతీపురం: వినతులు స్వీకరిస్తున్న జేసీ శోభిక, డీఆర్వో హేమలత, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

అడ్వంచర్ పార్క్ పరిశీలన

స్థానిక ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌ను కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఐటీడీఏ పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డిలు సందర్శించారు. పార్క్‌లో నూతనంగా ఏర్పాటు చేయనున్న గిరి గ్రామదర్శిని, స్విమ్మింగ్ పూల్ నిర్మాణాలకు సంబంధించి స్థలాన్ని పరిశీలించారు. త్వరలో పనులు ప్రారంభించి పూర్తిచేయాలని ఐటీ డీఏ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలన లో ఏపీవో జి.చిన్నబాబు, టీడబ్ల్యు ఈఈ పి.రమాదేవి, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవీ కరుణాకర్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర్రాజు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జీవనం కష్టంగా ఉంది.. ఆదుకోండి

జీవనం కష్టంగా ఉంది.. ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని ఓ నిరుపే ద గిరిజనుడు కలెక్టర్‌ను వేడుకున్నాడు. సోమవారం సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో వినతి సమర్పించాడు. కొత్తూరు మండలం మెట్టూరు గ్రామానికి చెందిన బొంతు వెంకట్రావు అనే గిరిజనుడు ఏడాది కిందట పక్షవాతానికి గురై మంచం పట్టాడు. దీంతో భర్త వైద్యం కోసం భార్య వనజాక్షి కూలి పనులు చేస్తూ ఇంతవరకు నెట్టుకొచ్చింది. క్రమేపి ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి క్షీణించడంతో ఐటీడీఏను ఆశ్రయించారు. తమకు ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని కోరారు.

సత్వర పరిష్కారం చూపాలి: జేసీ

పార్వతీపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ విభాగానికి ప్రజల నుంచి వచ్చిన వినతులకు సత్వర పరిష్కారం చూపాలని జేసీ ఎస్ఎస్ శోభిక అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో హేమలత, కేఆర్సీ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డితో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు



సీతంపేటరూరల్: అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

స్వీకరించారు. రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ గుమ్మలక్ష్మీపురం మండలం వకనాబడి గ్రామానికి చెందిన కె.చిట్టిబాబు అర్జీ సమర్పించారు. తమ ఇళ్లు తోటపల్లి రిజర్వాయర్ ముంపునకు గురైనప్పటికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీగానీ, ఎటువంటి నష్టపరిహారం అందలేదని జిమ్మమ్మవలస మండలం బాసంగి గ్రామానికి చెందిన ఎన్.అచ్యుతరావు వినతిపత్రం అందించారు. వ్యవసాయ బోర్లు మంజూరు చేయాలని, సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. పార్వతీపురం మండలం సాకిగెడ్డలో ఆక్రమణలను తొలగించాలని కోరుతూ సాకిగడ్డ నీటి సంఘం అధ్యక్షుడు బి.సూర్యనారాయణతో పాటు టీడీపీ నాయకులు శంకరరావు, గౌరీశంకర్ కోరారు. దీంతో జేసీ స్పందించి.. ఆ ప్రాంతాన్ని సందర్శించి నివేదికలు ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

యోగాతో మానసిక ప్రశాంతత



సీతంపేట రూరల్: యోగా చేస్తున్న పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి



సాలూరు రూరల్: యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

సీతంపేట రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా ప్రతిరోజూ యోగా చేస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. యోగాంధ్రలో భాగంగా సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఏపీవో జి.చిన్నబాబు, డీఆర్డీఏ పీడీ ఎం.సుధారాణిలు పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బీబీ మిశ్రో, ఏపీఎం కమలకుమారి పాల్గొన్నారు. ● జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో సోమవారం యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా అధికారులు, స్థానికులతో కలిసి యోగాసనాలు వేశారు.



వీరఘట్టం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



బొబ్బిలి: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో..



తెర్లాం: యోగా చేస్తున్న ఉద్యోగులు, ఉపాధి కూలీలు

శిక్షణా కార్యక్రమానికి హాజరు కావాలి

బాడంగి, మే 26(ఆంధ్రజ్యోతి): యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 27 నుంచి 31 వరకు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు ఉంటుందని తెలిపారు.

యోగా డేను విజయవంతం చేయాలి

రామభద్రపురం, మే 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద మంగళ వారం నిర్వహించనున్న యోగా డేను విజయవం తం చేయాలని ఎంపీడీవో రత్నం కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె ఉన్నత పాఠశాలను పరిశీలించారు. సుమారు 500 మందితో ఈ యోగా దినోత్సవాన్ని జరపడానికి ఏర్పాట్లు చేశా మన్నారు. ఎస్ఐ వెలమల ప్రసాదరావు, రామభ ద్రపురం పంచాయతీ ఈవో శ్రీనివాసరావు, మండల అధికారులు పాల్గొన్నారు.

మహానాడు ఒక చారిత్రక ఘట్టం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): మహానాడు ఒక చారిత్రక ఘట్టమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో ఆమె సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర శాసనసభ చీఫ్ బి.వీరాంజనేయులు, పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహానాడు కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి ఇప్పటికే వందలాది నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారన్నారు. రాష్ట్రంలో ప్రజారంజక పాలన అందించడానికి మహానాడులో పలు తీర్మానాలు చేయనున్నట్టు ఆమె తెలిపారు. ఈనెల 27, 28, 29 తేదీల్లో టీడీపీలో ఒక పండగ వాతావరణం ఉంటుందన్నారు.

మద్యం ధ్వంసం

సీతానగరం, మే 26 (ఆంధ్రజ్యోతి): సీతానగరం సర్కిల్ పరిధిలో వివిధ సోదాల్లో పట్టుబడిన మద్యం సీసాలు, సారాను సోమవారం ధ్వంసం చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ సూపరింటెండెంట్ వీవీఎన్ బాబ్జీరావు ఆదేశాల మేరకు సహాయ సూపరింటెండెంట్ బి.జీవన్‌కిశోర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టినట్టు సీఐ డి.పద్మావతి తెలిపారు. 72 కేసుల్లో పట్టుబడిన 106.75 లీటర్ల మద్యం, 2 కేసుల్లో పట్టుబడిన 39.5 లీటర్ల సారాను ధ్వంసం చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ, హెచ్‌సీలు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు

బొబ్బిలి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఈ మేరకు నియోజకవర్గ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసిందని ఆర్డీవో జీవీఎస్ఎస్ రామ్మోహనరావు తెలిపారు. సోమవారం బొబ్బిలి ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కమిటీతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండి ఓటు హక్కు లేని దివ్యాంగులను గుర్తించి, ఓటరు జాబితాలో చేర్చాలని సూచించారు. వీరికి ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు నియోజకవర్గ స్థాయి కమిటీలను ఏర్పాటుచేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్, తహసీల్దార్ మల్లపురెడ్డి శ్రీను, కమిషనర్ లాలం రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత మండలంగా బాడంగి

బాడంగి, మే 26(ఆంధ్రజ్యోతి): బాడంగిని సారా రహిత గ్రీన్ మండలంగా తీర్మానించామని బొబ్బిలి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.చిన్నంనాయుడు తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన నవోదయం 2.0 సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. అలాగే మండలంలోని 25 పంచాయతీలను కూడా సారా రహిత పంచాయతీలుగా తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎస్.రామకృష్ణ, తహసీల్దార్ కె.సుధాకర్, ఎస్ఐ తారకేశ్వరరావు, ఎక్సైజ్ ఎస్ఐ బి.రాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

సారా అమ్మకందారుల బైండోవర్

కురుపాం, మే 26(ఆంధ్రజ్యోతి): కురుపాం, జియ్యమ్మవలస మండలంలో సారా అమ్ముతూ పట్టుబడిన 18 మందిని, సారా తయారీకి ఉపయోపడే అమోనియా సరఫరా చేసి ముగ్గురు వ్యాపారులకు మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్(తహసీల్దార్) ముందు సోమవారం హాజరు పరిచి బైండోవర్ చేయించినట్టు కురుపాం ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఒక సంవత్సరంలో మళ్లీ సారా కేసులో పట్టుబడితే రూ.2లక్షల జరిమానా విధిస్తామని, అలాగే అపరాధ రుసుం చెల్లించని పక్షంలో రిమాండ్ విధిస్తామని హెచ్చరించి, బైండోవర్ చేశామని తెలిపారు.

రోడ్లు నిర్మాణాలకు టెండర్లు పిలుస్తాం

సాలూరు రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): సాలూరు మున్సిపల్ పరిధిలో పలు రోడ్ల నిర్మాణాలకు టెండర్లు పిలవనున్నట్టు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ బీవీ ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శివాజీ బొమ్మ నుంచి వాటర్ వర్క్స్ వరకు, రైల్వేస్టేషన్ రోడ్డు, దండిగాం రోడ్డు తదితర రోడ్డు పనులకు టెండర్లు పిలుస్తామని చెప్పారు. ఎల్ఆర్ఎస్, బీపీఎస్ కింద వచ్చిన రూ.2కోట్ల నిధులతో పైలెట్ వాటర్ స్కీంలు, రోడ్లు తదితర వాటిని నిర్మించనున్నామన్నారు. సాలూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జరిగేలా కార్యాచరణ చేస్తున్నామన్నారు.

29న మెగా జాబ్ మేళా

బొబ్బిలి రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలో స్థానిక శ్రీసాయి డిగ్రీ కళాశాలలో ఈనెల 29న మెగా జాబ్ మెళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్, ఏదైనా పీజీలో ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు అర్హులని ఆయన చెప్పారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు ఉన్నవారు ఉదయం 9 గంటలకు తమ అర్హత పత్రాలతో కళాశాలకు చేరుకోవాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.